నమ్మి ఓట్లేస్తే ప్రజల గొంతు కోస్తున్న కాంగ్రెస్ : హరీశ్ రావు

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

ఐఎఎస్‌లకు పోస్టింగ్‌లు

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 303 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- సోమవారం 28 అక్టోబర్ 2024

మూసీ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): మూసీ నది పై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి కీలక ప్రకటన చేశారు. ఇవాళ హైదరాబాద్‌లో నిర్వహించిన సదర్ ఉత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. యాదవులకు రాజకీయంగా మరిన్నీ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. యాదవులు ధర్మం వైపు నిలబడుతారని పేర్కొన్నారు. ధర్మం వైపు నిలబడిన ఎవ్వరూ అన్యాయానికి గురికారు అని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి పై యాదవుల పాత్ర కీలకమైనదని పేర్కొ న్నారు. అంతేకాదు.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీదని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనేది కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని పేర్కొన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాలని.. నిర్ణయించాం. మూసీ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మరోసారి కీలక ప్రకటన చేశారు. మూసీ నదిలో నరకాన్ని అనుభవిస్తున్న ప్రతీ పేద వాడి జీవితంలో వెలుగులు నింపుతామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.

భాజపా ప్రభుత్వం వస్తేనే బెంగాల్లో అక్రమ వలసలు ఆగుతాయి: అమిత్ షా

కోల్‌కతా:అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): పశ్చిమ బెంగాల్‌లో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ ముందున్న పెద్ద టార్గెట్ అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.కోల్‌కతాలో పర్యటన సందర్భంగా భాజపా శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం చొరబాట్లను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. వీటిని తక్షణమే ఆపాలన్నారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, అవినీతి ఆగాలంటే 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ప్రభుత్వం ఏర్పాటుతోనే సాధ్యమన్నారు. బెంగాల్‌లో మహిళలకు భద్రత లేదని చెప్పడానికి సందేశ్ ఖాళీ హింస, ఆర్‌జీ కర్ ఆస్పత్రి ఉదంతాలే నిదర్శనమని చెప్పారు.బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు అక్రమ వలసలు పెరగడం వల్ల దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆందోళన వ్యక్తంచేశారు.అక్రమ చొరబాట్లను ఆపినప్పుడే పశ్చిమ బెంగాల్‌లో శాంతి నెలకొంటుందన్నారు.“అక్రమ వలసలు ఇండో-బంగ్లాదేశ్ శాంతికి హాని కలిగిస్తాయి. వీటిని పూర్తిగా నివారించాలంటే బెంగాల్ ప్రజలు 2026 ఎన్నికల్లో భాజపాను గెలిపించాలి. మా ప్రభుత్వం మాత్రమే అక్రమ వలసలను నివారించి, రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పగలదు” అని తెలిపారు.బెంగాల్లో శాంతిని నెలకొల్పేందుకు ల్యాండ్ పోర్ట్‌లు ముఖ్యమని షా పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య కనెక్టివిటీని, సత్సంబంధాలను మెరుగుపరచడంలో ఈ పోర్ట్‌లు కీలక పాత్ర పోషిస్తూ వాణిజ్య సంబంధాలను మెరుగుపరుస్తాయని అన్నారు. బెంగాల్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందని దుయ్యబట్టారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ.56,000 కోట్ల నిధులను రాష్ట్రానికి ఇచ్చిందని వెల్లడించారు.పశ్చిమ బెంగాల్‌లోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని పెట్రాపోల్ ల్యాండ్ పోర్ట్‌లో కొత్త ప్యాసింజర్ టెర్మినల్ భవనం, కార్గో గేట్‌ను కేంద్రమంత్రి ప్రారంభించారు. పెట్రాపోల్ ల్యాండ్ పోర్ట్ వద్ద టెర్మినల్ భవన నిర్మాణానికి సుమారు రూ.500 కోట్లు వెచ్చించారు.

బస్సు యజమానులుగా డ్వాక్రా మహిళలు: భట్టి

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): మహిళాభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని మహిళా శక్తి క్యాంటీన్, బస్సు షెల్టర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.వడ్డీలేని రుణాలు ఇచ్చి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. వాళ్లకు రూ. 25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.“ఆర్టీసీలో డ్వాక్రా సంఘాలను భాగస్వామ్యం చేయాలని ఆలోచిస్తున్నాం. మరికొద్ది రోజుల్లో డ్వాక్రా మహిళలు బస్సు యజమానులుగా మారతారు. వాళ్లకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయిస్తాం. ఆ వాహనాలను ఆర్టీసీకి అద్దెకు ఇప్పిస్తాం. మహిళల భాగస్వామ్యంతో ఖమ్మంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. వడ్డీ లేని రుణాల పంపిణీని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి” అని భట్టి విక్రమార్క తెలిపారు.

అబిడ్స్‌లో బాణసంచా దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): అబిడ్స్ పరిధిలోని బొగ్గులకుంటలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బాణసంచా దుకాణంలో అగ్నిప్రమాదం జరగడంతో భారీగా మంటలు చెలరేగాయి. మంటలు పక్కనున్న హోటల్‌కు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు మూడు ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పటానికి ప్రయత్నిస్తున్నాయి. మంటలు అంటుకుని ఇప్పటికే పదికి పైగా వాహనాలు దగ్ధమయ్యాయి. దేవాదాయశాఖ కార్యాలయానికి సమీపంలోనే ఈ అగ్నిప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం.

రాజకీయంగా ఎదుర్కోలేకే మా బంధువులపై కేసులు: కేటీఆర్

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): రాజకీయంగా ఎదుర్కోలేకే తమ బంధువులపై కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. కుట్రలతో తమ గొంతు నొక్కలేరన్నారు.జన్వాడ ఫామ్‌హౌస్ ఘటనపై కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. “మూసీ కుంభకోణం, వందరోజుల్లో అమలు చేస్తామన్న హామీలు, బావమరిదికి ఇచ్చిన కాంట్రాక్టు వ్యవహారంతో పాటు అనేక స్కామ్‌లను భారాస బయటపెడుతోంది. మా ప్రశ్నలకు రాజకీయంగా సమాధానం చెప్పలేక కుట్రలకు తెరలేపారు. మా ధైర్యాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేక.. మా కుటుంబ సభ్యులు, బంధువులపై కేసులు బనాయిస్తున్నారు. కుట్రలు చేసి మా గొంతునొక్కాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఇదంతా చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో అడుగుపెట్టిన రోజే చావుకు తెగించి వచ్చాం.ఇలాంటి కేసులకు భయపడే ప్రసకే లేదు. దాదాపు 22 గంటలుగా మా బంధువుల ఇళ్లలో ప్రహసనంలా సోదాల కార్యక్రమం కొనసాగిస్తున్నారు. నా బావమరిది రాజ్ పాకాల ఉంటున్న సొంత ఇంట్లో దీపావళి పండుగ సందర్భంగా దావత్ చేసుకోవడం తప్పా? గృహ ప్రవేశం సందర్భంగా బంధువులను పిలిచి దావత్ ఇచ్చారు. కొందరు రేవ్‌పార్టీ అని ఇష్టమొచ్చి మాట్లాడుతున్నారు. అసలు రేవ్ పార్టీ అంటే అర్థం తెలుసా? వృద్ధులు, చిన్న పిల్లలతో సహా కుటుంబం మొత్తం బంధుమిత్రులతో కలిసి ఉంటే దాన్ని రేవ్ పార్టీ అని ప్రచారం చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. పార్టీలో అసలు డ్రగ్స్ దొరకలేదు. ఆ వ్యక్తి ఎక్కడి నుంచి డ్రగ్స్ తీసుకున్నాడో తెలియదు. చేతనైతే రాజకీయంగా తలపడండి.. ఇచ్చిన హామీలపై దృష్టి సారించండి” అని కేటీఆర్ అన్నారు.

కులగణనపై ప్రణాళిక శాఖ ఫార్మెట్ సిద్ధం

● 7 పేజీలు.. 54 ప్రశ్నలు..!? ● ఆధార్ సహా కుటుంబ సభ్యులు వివరాలు

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన కోసం ప్రణాళిక శాఖ ప్రత్యేక ఫార్మాట్ తయారు చేసింది. మొత్తం 7 పేజీలలో 54 ప్రశ్నలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబ సమగ్ర సమాచారాన్ని సేకరించేలా దీనిని రూపొందించింది. వ్యక్తిగత వివరాలే కాకుండా ఆస్తులు, రిజర్వేషన్లతో పొందిన ప్రయోజనాలు వంటి ఇతర వివరాలను కూడా సేకరించే విధంగా సిద్ధం చేసినట్టు తెలిసింది. ప్రతి జిల్లా, మండలం, గ్రామం, మున్సిపాలిటీ, వార్డు నంబరు, ఇంటి నంబర్లకు ప్రత్యేక కోడ్ ఇవ్వడం ద్వారా ఈ సమాచారాన్ని నమోదు చేసేలా ప్రణాళిక శాఖ ఏర్పాట్లు చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు కులగణన ఫార్మాట్ ప్రకారం **పార్ట్ -1...** క్రమసంఖ్య, కుటుంబ యజమాని-సభ్యుల పేర్లు, యజమానితో సంబంధం, జెండర్, మతం, కులం, సామాజిక వర్గం, ఉప కులం, ఉప కులం ఇతర పేర్లు, వయసు, మాతృభాష, ఆధార్ నంబర్.**పార్ట్ -2...** ఎలక్షన్ కమిషన్ గుర్తింపు కార్డు, దివ్యాంగులైతే వైకల్య రకం, వైవాహిక స్థితి, వివాహ కాలం నాటికి వయసు, ఆరేళ్ల వయసులోపు పాఠశాలలో చేరారా లేదా?, పాఠశాల రకం, విద్యార్హతలు, 6-16 ఏళ్ల మధ్య వయసువారు బడి మానేస్తే ఆ సమయానికి చదువుతున్న తరగతి, వయసు, బడి మానేయటానికి గల కారణాలు, 17-40 ఏళ్లలోపు వారు విద్యను కొనసాగించకపోవడానికి గల కారణాలు, నిరక్షరాస్యులైతే చదువుకోకపోవడానికి గల కారణాలు.**పార్ట్-3...** ప్రస్తుతం ఏదైనా పనిచేస్తున్నారా?, చేస్తుంటే ఆ వృత్తి, స్వయం ఉపాధి అయితే సంబంధిత వివరాలు, రోజువారీ వేతన జీవులైతే

వివరాలు 2లో

ఫాంహౌస్ పార్టీ.. డీజీపీ జితేందర్‌కి కేసీఆర్ ఫోన్..!

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): జన్వాడ ఫాం హౌస్ పార్టీ ఘటన సంచలనంగా మారిన విషయం తెలిసిందే. హైదరాబాద్ శివార్లలో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫామ్ హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీకి సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది.రాజు పాకాల ఫామ్ హౌజ్‌లో క్యాసినో నిర్వహించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. క్యాసినోకు సంబంధించిన కాయిన్స్ స్వాధీన పరుచుకున్నారు. పార్టీలో పెద్ద ఎత్తున క్యాసినో నడిచినట్టు అధికారులు గుర్తించారు. నాలుగు సూట్ కేసుల్లో క్యాసినో మెటీరియల్ ను స్వాధీనం చేసుకున్నారు.జన్వాడ ఫాం హౌస్ పార్టీ పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరా తీశారు. తాజాగా డీజీపీ జితెందర్ కు ఫోన్ చేసి రాజ్ పాకాల, ఆయన సోదరుడు శైలేందర్ ఇళ్లలో తనిఖీలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా సోదాలు చేస్తారని ప్రశ్నించారు. వెంటనే తనిఖీలను ఆపాలని డీజీపీని కోరారు మాజీ సీఎం కేసీఆర్.

కెటిఆర్ బామ్మర్ది ఇంటి దగ్గర హైటెన్షన్

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): రాయదుర్గంలోని కెటిఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఇంటి దగ్గర ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. రాజ్ పాకాల ఇంట్లోకి వెళ్లేందుకు ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ప్రయత్నించారు. ఎక్సైజ్ అధికా రులు, పోలీసులను బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, నేతలు అడ్డుకుం టున్నారు. రాజ్ పాకాల ఇంటిదగ్గరకు బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు చేరుకోవడంతో హైటెన్షన్ నెలకొంది. రాజ్ పాకాల ఇంటి ముందు బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. బిఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.కొత్త ఇల్లు కట్టుకొని ఇటీవలే రాజ్ పాకాల గృహ ప్రవేశం చేశారని బిఆర్ఎస్ ఎంఎల్ఎలు వివేకానంద, సంజయ్‌లు ప్రశ్నించారు. మితిమీరి పని చేసే అధికారుల చిట్టా రాసుకుంటున్నామని, సొంత ఇంట్లో పార్టీ చేసుకుంటే తప్పేంటి అని పోలీసులను బిఆర్ఎస్ ఎంఎల్ఎలు నిలదీశారు. సొంత ఇంట్లో పార్టీ చేసుకోవద్దా అని అడిగారు.

జర్నలిస్టుల రక్షణకు చట్టాన్ని తీసుకురావాలి

- కేంద్రాన్ని కోరిన ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా

भारतीय प्रेस परिषद
PRESS COUNCIL OF INDIA
CENTRAL STATUTORY AUTHORITY

న్యూఢిల్లీ:అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): దేశంలో జర్నలిస్టుల భద్రత రక్షణ కోసం ఒక చట్టాన్ని తీసుకురావాలని కేంద్రాన్ని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పీసీఐ కోరింది. దేశంలో మీడియా సిబ్బంది అరెస్టులు తప్పుడు నిర్బంధాలు, బెదిరింపులపై ప్రెస్ కౌన్సిల్ సభ్యులు గుర్బీర్‌సింగ్ రూపొందించిన నివేదికను పీసీఐ ఆమోదించింది. అయితే కౌన్సిల్ చైర్‌పర్సన్,సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన్ ప్రకాశ్ దేశారు నుంచి ఈ విషయంలో భిన్నాభిప్రాయం వ్యక్తమైనప్పటికీ నివేదికకు సమర్థన లభించటం గమనార్హం. ఈ నివేదిక కేంద్రానికి ప్రధానంగా మూడు ప్రతిపాదనలను చేసింది.అందులో మొదటిది దేశంలో జర్నలిస్టుల రక్షణ భద్రత కోసం జాతీయ చట్టాన్ని ప్రకటించటం. అలాగే, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యాక్ట్‌కు మరిన్ని అధికారాలు కలిగించాలని ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియాతో వ్యవహరించే విధానంపై పోలీసులకు అవగాహన కల్పించటం. చట్టాన్ని అమలు పరిచే సంస్థల ప్రవర్తన నిబంధనలను క్రోడీకరించాలని నివేదికలో పేర్కొన్నది.

బిఆర్ఎస్ నాయకుల అరెస్టు

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):మాజీ మంత్రి కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల సోదరుడు శైలేంద్ర పాకాల ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి న్యాయవాది సమక్షంలో ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించారు. శైలేంద్ర పాకాల ఇంటి వద్ద బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేసారు.ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడకు స్పెషల్ పార్టీ పోలీసులు భారీగా చేరుకున్నారు. పరిస్థితి ముదిరి తోపులాట జరిగింది. దీంతో పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్ ఇంటి వద్ద బిఆర్ఎస్ నాయకులను భౌతిక దాడి చేస్తూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందను,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను అరెస్ట్ చేసారు.

39 మంది పోలీసుల సస్పెండ్

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):తెలంగాణ స్పెషల్ పోలీస్‌కి చెందిన 39 మంది సిబ్బందిని తెలంగాణ పోలీసు శాఖ ఆదివారం సస్పెండ్ చేసింది. ఈ సిబ్బంది బెటాలియన్ క్యాంపస్ లోపల, వీధుల్లో నిరసనలలో నిమగ్నమై ఉన్నారు.వివిధ జిల్లాల్లో కానిస్టేబుళ్లు యూనిఫారంలో వీధుల్లోకి రావడం, నిరసనల నేపథ్యంలో ఈ సస్పెన్షన్‌లు జరిగాయి.రాజ్యాంగంలోని ఆర్టికల్ 311ను ప్రయోగించి సస్పెన్షన్ వేటు విధించింది. ఈ మేరకు పోలీస్ ఉద్యోగంలో ఉండి ధర్నాలు, ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న వారికి షాక్ ఇచ్చింది. సర్వీసులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన 39 మంది టీజీఎస్పీ పోలీస్ కానిస్టేబుల్స్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.యూనిఫాం ధరించిన వారిలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, నిరసనలను విరమించుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ జితేందర్ సిబ్బందిని కోరారు. ఇటువంటి చర్యల కారణంగా చట్టపరమైన శిక్షలు విధించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. “ఒక రాష్ట్రం, ఒక పోలీసు” విధానం కోసం ఇటీవల పోలీసు కుటుంబాలు రోడ్ల మీదకు వచ్చాయి.

ముగిసిన గ్రూప్-1 మెయిన్స్ ..

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):రాష్ట్రంలో గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 563 పోస్టులకు 21 నుంచి మెయిన్స్ ఎగ్జామ్స్ నిర్వహించారు. వరుసగా 7 రోజుల పాటు పరీక్షలు జరిగాయి.జీవో 29ను రద్దు చేశాకే పరీక్షలు జరపాలని కొందరు అభ్యర్థులు ఆందోళన చేసినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు.

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION

కులగణనపై ప్రణాళిక శాఖ ఫార్మెట్ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఏ రంగంలో పనిచేస్తున్నారు?, కులవృత్తి, ప్రస్తుతం కులవృత్తిలో కొనసాగుతున్నారా లేదా?, కులవృత్తి కారణంగా ఏమైనా వ్యాధులు సంక్రమించాయా?, వార్షికాదాయం, ఆదాయ పన్ను చెల్లింపుదారులా?, బ్యాంకు ఖాతా ఉందా లేదా?**పార్ట్-4...** రిజర్వేషన్ల వల్ల పొందిన విద్య ప్రయోజనాలు, ఉద్యోగ ప్రయోజనాలు, ఎస్సి, ఎస్‌టి, బిసి, ఈబిసి వర్గాలకు చెందిన వారైతే కుల ధ్రువీకరణ పత్రం పొందారా?, సంచార లేదా పాక్షిక సంచార తెగకు చెందిన వారా?, రాజకీయ నేపథ్యం ఏమిటి?, ప్రజాప్రతినిధిగా ఉంటే ప్రస్తుత పదవి ఏమిటి?, ఎన్ని సార్లు ప్రజాప్రతినిధిగా ఉన్నారు?, మొత్తం ఎన్ని సంవత్సరాలు ఉన్నారు?, నామినేటెడ్, కార్పొరేష న్, ప్రభుత్వ సంస్థలు వేటిలోనైనా సభ్యులా?**పార్ట్-5...** ధరణి పాస్‌బుక్ ఉందా, లేదా?, ఉంటే పాస్‌బుక్ నంబర్, భూమిరకం, విస్తీర్ణం, వారసత్వమా?, కొన్నదా?, బహుమానమా?, అసైన్డ్ భూమా?, అటవీ హక్కుల ద్వారా పొందినదా?, ప్రధాన నీటి వనరు, పండే పంటలు, ఏమైనా రుణాలు తీసుకున్నారా?, ఏ అవసరం నిమిత్తం తీసుకున్నారు?, ఎక్కడి నుంచి తీసుకున్నారు?, వ్యవసాయ అనుబంధంగా ఏదైనా పనిచేస్తారా?, కుటుంబానికి చెందిన పశుసంపద (ఆవులు, ఎద్దు, గేదెలు, మేకలు, కోళ్లు, బాతులు, పందులు, ఇతరాలు) వివరాలు.**పార్ట్-6...** కుటుంబ స్థిరాస్తుల వివరాలు, ఆస్తుల సంఖ్య, చరాస్తుల వివరాలు, ఆస్తుల సంఖ్య, ప్రభుత్వం నుంచి పొందిన ప్రయోజనాలు, నివాస గృహం రకం, స్వభావం, మరుగుదొడ్డి ఉందా, లేదా?, ఉంటే వాడుతున్నారా? వంట కోసం ఉపయోగించే ప్రధాన ఇంధనం, ఇంటికి విద్యుత్ సదుపాయం ఉందా?

వ్యర్థాలను తొలగించే బాధ్యత బిల్డర్లదే: హైడ్రా కమిషనర్

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ మరోసారి స్పష్టతనిచ్చారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న భవనాలను హైడ్రా కూల్చివేయదని హామీ ఇచ్చారు.సర్వే నెంబర్లు మార్చి, తప్పుడు సమాచారంతో అనుమతులు పొంది ఉంటే కనుక చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. తప్పుడు అనుమతులతో చెరువులు, నాలాలను ఆక్రమించిన నిర్మాణాలు కూల్చుతామని వెల్లడించారు. హైడ్రా వంద రోజులు పూర్తి చేసుకుందన్నారు. హైడ్రా అక్రమ నిర్మాణాలను కూల్చుతుందని, ఆ తర్వాత వ్యర్థాలను తొలగించే బాధ్యత బిల్డర్లదే అన్నారు. వ్యర్థాలను తొలగించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలువైన వస్తువులను తీసుకెళ్లి%౦%మిగతా వ్యర్థాలను వదిలేస్తే హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. అలా కాని పరిస్థితుల్లో వ్యర్థాలను హైడ్రా తొలగిస్తే అందుకయ్యే ఖర్చును నిర్మాణదారుడి నుంచి వసూలు చేస్తామన్నారు.

ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- ఆమ్రపాలికి టూరిజం ఎండీగా కీలక బాధ్యతలు
- కార్మికశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణి ప్రసాద్
- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌గా వాకాణి కరుణ
- జీఏడీ ముఖ్య కార్యదర్శిగా వాణిమోహన్

అమరావతి :అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ నుంచి ఇటీవల ఏపీకి బదిలీ అయిన ఐఏఎస్ అధికారులకు ఏపీ ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆదివారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ టూరిజం ఎండీగా ఆమ్రపాలికి పోస్టింగ్‌తో పాటు టూరిజం అథారిటీ సిఈఓగా అదనపు బాధ్యతలు కేటాయించారు. అంతేకాకుండా కార్మికశాఖ ముఖ్య కార్యదర్శిగా వాణి ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌గా వాకాణి కరుణ, జీఏడీ ముఖ్య కార్యదర్శిగా వాణిమోహన్‌కు బాధ్యతలు అప్పగించారు.మరో ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రోస్‌కు మాత్రం ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదు. కాగా డీఓపీటీ ఆదేశాల మేరకు ఇటీవలే ఏపీలో నలుగురు ఐఏఎస్ అధికారులు రిపోర్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌కు అధికారులు ఆమ్రపాలి, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ వాణిప్రసాద్ రిపోర్టు చేశారు. మరోవైపు ఏపీ నుంచి రిలీవ్ అయిన ముగ్గురు ఐఏఎస్ అధికారులు తెలంగాణ సీఎస్ శాంతికుమారికి రిపోర్ట్ చేశారు. అంతకుముందు ఏపీకి వెళ్లేందుకు నలుగురు అధికారులూ నిరాకరించారు. తెలంగాణలోనే కొనసాగేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశారు. చివరకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ఏపీలో రిపోర్టు చేశారు.

హనుమకొండ జిల్లాలో విషాదం.. నీటి సంపులో పడి చిన్నారి మృతి

భీమదేవరపల్లి,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి చిన్నారి గడిపె అస్మిక(3) మృతి చెందిన విషాదకర ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గడిపె సంపత్, స్వర్ణలకు ముగ్గురు సంతానం. దినసరి కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా, ఆదివారం అస్మిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా అస్మిక ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడింది.అటుగా వెళ్తున్న అస్మిక మేనత్త కూతురు సుశాంకిత నీటి సంపులో పడి ఉన్న బాలికను చూసి వెంటనే బయటకు తీసి కుటుంబసభ్యులకు సమాచారం అందించింది.108కి సమాచారమందించగా సిబ్బంది వచ్చి అస్మిక మృతి చెందినట్లు వెల్లడించారు. అస్మిక తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వంగర ఎస్ఐ దివ్య తెలిపారు. అస్మిక మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఫామ్‌హౌస్ రైడ్‌లో 40 మంది పాల్గొన్నారు : కమలాసన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): సైబరాబాద్ పోలీసులతో కలిసి ఎక్సైజ్ పోలీసులు ఆదివారం తెల్లవారు జామున జాయింట్ ఆపరేషన్ నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి తెలిపారు. రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌పై రైడ్ చేశామని వివరించారు. ఈ పార్టీలో 40 మంది పాల్గొన్నారని వెల్లడించారు. వీరిలో 18 మంది మహిళలు ఉన్నారన్నారు. 12 ఇంపోర్టెడ్ బాటిళ్లు, న్యూఢిల్లీ నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డిపిఎల్) మద్యం బాటిళ్లు, మహారాష్ట్ర నుంచి ఎన్‌డిపిఎల్ మద్యం బాటిళ్లు 11కెఎఫ్ అల్ట్రా బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ పార్టీని రాజ్ పాకాల నిర్వహించారన్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ పార్టీ నిర్వహించారని వెల్లడించారు. పార్టీలో ఎన్‌డిపిఎల్‌ను సర్వ్ చేశారన్నారు. ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించి ఈ రెండు నేరాలకు పాల్పడ్డారన్నారు. ఈ విసయంపై చేవెళ్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ఈ రెండు నేరాలపై ఎక్సైజ్ యాక్ట్ 34(a),34(1),9(1) కింద కేసులను నమోదు చేశామని కమలాసన్ రెడ్డి వెల్లడించారు.

నమ్మి ఓట్లేస్తే ప్రజల గొంతు కోస్తున్న కాంగ్రెస్ : హరీశ్ రావు

సిద్దిపేట,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మూడుసార్లు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసి, నేడు అధికారంలోకి రాగానే రైతులకు రైతుబంధు ఇవ్వకుండా మోసం చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు(విమర్శించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ పారుఖ్ హుస్సేన్‌తో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపడచులకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని ఒకటి కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో పెట్టిందని మండిపడ్డారు.అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కేసీఆర్ హయాంలో వానకాలం, యాసంగికి రైతుబంధు ఇచ్చారన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారని, తులం బంగారం దేవుడెరుగు కల్యాణ లక్ష్మి కూడా ఇవ్వట్లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదిలోపు లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 11 నెలలు కావొస్తుంది. కానీ, 25000 ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. పీఆర్సీ ఇస్తామన్నారు కాని దానిని కూడా ఇవ్వలేదన్నారు. పేదొడికి ఇళ్లు ఇవ్వకుండా.. ఉన్న ఇండ్లను కూడా కూలగొడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మాయమాటలతో నమ్మించారు. ప్రజలు నమ్మి ఓటేస్తే గొంతుకోస్తున్నారని మండిపడ్డారు.

ఘనంగా జరిగిన జల్సా- ఎ-ఫైజాన్- ఎ-గౌస్-ఎ-ఆజం జల్సా కార్యక్రమం

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): నగరంలోని అంబెద్కర్ నగర్ లో వున్న అన్వర్ ఉలుమ్ మదర్సలో గౌసే ఆజం దస్తగిర్ వారి గ్యార్వి షరీఫ్ వేడుక ఘనంగా నిర్వహించడం జరింగింది. ముఖ్య అతిథిగా షా అజీజుల్లా ఖాద్రీ, హజ్రత్ అల్లామా మౌలానా అల్-ఆలమ్ అలీముద్దీన్, మరియు ఇమామ్ లు పాల్గొని, ప్రసంగించారు, వారికి సన్మాన కార్యక్రమమును నిర్వహించారు, అనంతరం నాథ్ షరీఫ్, సలాం చదివి ఫాతేహ ఖని చేసిన తర్వాత అన్నదాన కార్యక్రమం జరింగింది, పెద్ద ఎత్తున జనం పాల్గొని గ్యార్వి షరీఫ్ వేడుకను విజయవంతం చేశారు.

ప్రతి నెల 2వ, 4వ ఆదివారాల్లో నిర్వహించే హోమియో ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి

హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రతి నెల 2వ 4వ ఆదివారాల్లో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించే హోమియోపతి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీ రామకృష్ణ సేవా సమితి, కే ఎల్ ఎన్ రెడ్డి కాలనీ, హనుమకొండ ప్రాంగణంలో ఓరుగల్లు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్-వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో హోమియో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా మూర్తిత్రయంనకు హారతి, జ్యోతి ప్రజ్వలన తో ఉచిత వైద్య శిబిరం ప్రారంభమైంది. దాదాపు 20 మందికి ఉచిత వైద్య పరీక్ష చేసి వారికి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సత్యనారాయణ రెడ్డి, హోమియోపతి వైద్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస స్వామి, కెవి రావు, కే.సూర్య, లక్ష్మి రావు, పార్వతి, వీణ హోమియో పతిక్ డాక్టర్ల బృందం నుండి గౌరవాధ్యక్షులు డాక్టర్ సుధాకర్ రావు, అధ్యక్షులు భీంగాని లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కమల్ కిషోర్, ప్రధాన కార్యదర్శి రాంబాబు, కోశాధికారి బాసాని శ్రీకాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీధర్, ఎక్జ్యూటివ్ మెంబర్ సాయికృష్ణ, గీతా లక్ష్మి కీర్తి, పాల్గొన్నారు.

ఘనంగా లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి (Pdg) పదవి విరమణ అభినందన సభ

హనుమకొండ ప్రతినిధి, అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): 33 ఏళ్లుగా ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులుగా అంకిత భావంతో తనదైన శైలిలో విద్య సేవలందించి, అందరి మన్ననలను పొంది, ఈనెల 31న పదవీ విరమణ సందర్భాన్ని పురస్కరించుకొని, ఆదివారం రామానుజన్ కాన్సెప్ట్ స్కూల్ ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయులు Lion Dr. ముచ్చ రాజిరెడ్డి-అరుణ ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పుర ప్రముఖులు, బొ ది రెడ్డి ప్రభాకర్ రెడ్డి, కిషన్ రావు, రామ్ రెడ్డి ములుగు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నేతలు, PRTU రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పాల్ రెడ్డి, బిజెపి నాయకులు సర్వోత్తమ్ రెడ్డి, STU నాయకులు సదయ్య, నరసింహయ్య, లయన్స్ క్లబ్ గవర్నర్స్ PDGలు సుధాకర్ రెడ్డి, లక్ష్మి, నరసింహారావు, KC john బన్నీ PDG, lion నాయకులు రాంగోపాల్ రెడ్డి, అజిత్, హరికృష్ణ రెడ్డి, రమణారెడ్డి, జన్నపురెడ్డి రా జి రెడ్డి ,శారదా, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు,యాల్లా మురళి బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి-అరుణ దంపతులను గజమాలలతో, శాలువాలతో, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ముచ్చ రాజిరెడ్డి చేసిన విద్యారంగంలో, సామాజిక కోణంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కరీంనగర్ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలి: సొల్లు అజయ్ వర్మ

- ప్రముఖ శాస్త్ర వేత్త మహా ఏఐసిఈఓ
- ఎన్ఆర్ఐ చింతం నరేందర్‌కు విజ్ఞప్తి

కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(పీసీడబ్ల్యూ న్యూస్): ఈరోజు గుండ్లపల్లి లో ప్రముఖ శాస్త్రవేత్త మహా ఏఐ సీఈఓ ఎన్ఆర్ఐ .చింతం నరేందర్ అమెరికా నుండి కరీంనగర్ కు వచ్చిన సందర్భంగా గుండ్లపల్లి లో ఘనంగా స్వాగతం పలికి శాలువతో సత్కరించిన బిజెపి రాష్ట్ర నాయకులు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్ వర్మ తెలంగాణలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కరీంనగర్ జిల్లాలో కొన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసీ యువకులకు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కొత్త కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు ఈ సందర్భంగా చింతమ్ నరేందర్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా ప్రయత్నాలు చేస్తానని చెప్పారు ఈ కార్యక్రమంలో కొంకటి గణేష్ బోయిని హరీష్ మద్దూర్ మహేష్ ప్రదీప్ అనిల్ పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు గుంటుక లింగయ్య తదితరులు పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు.

33వ మదీనా గోల్డ్ మెడల్ అవార్డుకు ఎంపికైన డాక్టర్ తౌహీద్...

33rd MADINA
GOLD MEDAL
AWARDS FUNCTION

హైదరాబాద్, అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): మదీనా ఎడ్యూకేషన్ , వెల్ఫేర్ సొసైటీ హిమాయత్‌నగర్, హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రం తరపున ప్రియమైన విద్యార్థికి, అభినందనలు (33)వ మదీనా గోల్డ్ మెడల్ అవార్డ్స్ 2024 కోసం కమిటీ మీ పేరును ప్రతిపాదించిందని మీకు తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నామని.ఈ నెల26న (శనివారం) సాయంత్రం 6.30 గంటలకు లతీఫుద్దీన్ హాల్, మదీనా పబ్లిక్ స్కూల్, స్ట్రీట్ నెం18లో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి మిస్టర్ అమీరుల్లా ఖాన్, ప్రొఫెసర్, ఆర్థికవేత్త, ప్రొఫెసర్ ఎం.మంజూర్ హుస్సేన్, మాజీ రిజిస్ట్రార్, జెఎన్టీయుహెచ్, హైదరాబాద్,వారు ముఖ్య అతిథిగా పాల్గొని పతకాలను ప్రదానం చేయడానికి సమ్మతించారు. కాబట్టి మీరు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని నిర్దేశించబడ్డారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎంపీపీ రెడ్డి మల్లా రెడ్డి పరామర్శ

టేకుమట్ల, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): టేకుమట్ల మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో అక్కల రాజయ్య సోదరుడు అక్కల మాధవ్ అనారోగ్యం తో మరణించగా ఈ రోజు వారీ దశ దిన కర్మ సందర్భంగా వారి కుటుంబాన్ని కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేసీ వారి కుటుంబానికి 2000/- ఆర్థిక సహాయం అందించిన టెకు మట్ల మండల మాజీ ఎంపీపీ రెడ్డి మల్లా రెడ్డి వారి వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకునూరి.తిరుపతి మండల ముఖ్య నాయకులు కొండ్ర ఓదెలు,మూగయ్య,ఇళ్ళందుల శంకర్ , పర్ల పల్లి సాంబయ్య,భద్రయ్య, వంశీ కృష్ణ, స్థానిక నాయకులు నాయకులు పాల్గొన్నారు.

28 నుండి డిగ్రీ ప్రథమ సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షలు



శ్రీ రాజ రాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల-కరీంనగర్
S.R.R GOVT. ARTS & SCIENCE COLLEGE
KARIMNAGAR.

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): డిగ్రీ ప్రథమ సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 28 నుండి వచ్చే నెల 04 వరకు మధ్యాహ్నం 2:00 నుండి 5:00 గంట వరకు యస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాల (అ) కరీంనగర్ జిల్లాలో జరుగుతాయని ప్రాంతీయ సమన్వయ అభ్యాసకుల సహాయ కేంద్రం అధికారి డా,, వంగల శ్రీనివాస్ తెలియజేశారు.

బోడుప్పల్ ఫెడరేషన్ సెక్రటరీగా గుండేటి హరికృష్ణ

మేడ్చల్ జిల్లా, అక్టోబర్ 27 (పిసీడబ్ల్యూ న్యూస్): బోడుప్పల్ మున్సిపల్ కాలనీల సంక్షేమ సంఘాల సమాఖ్య ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు మరియు వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఏకగ్రీవంగా ఫెడరేషన్ సెక్రటరీగా చెంగిచర్ల శివదుర్గ నగర్ కాలనీ నుండి గుండేటి హరికృష్ణ గౌడ్ ఎన్నుకున్నారు ఫెడరేషనసెక్రెటరీగా బాధ్యతలు నా మీద నమ్మకంతో నన్ను సెక్రటరీగా ఎన్నుకున్నందుకు నా ఎన్నికలకు సహకరించిన ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ నా శక్తివంచనకు మించి మన కాలనీకి కాలనీవాసులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాను అని అన్నారు.

మానవత్వం చాటుకున్న చిలుకోయాలపాడు యువత

మహబూబాబాద్/సీరోల్,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా సిరోల్ మండలం అందనాలపాడు గ్రామానికి చెందిన పోతురాజు కనకమ్మ ఇటీవల పిడుగుపాటుకు గురి అయ్యి చనిపోవడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న చిలుక్కోయలపాడు యువత దశదిన కర్మకు హాజరై వారికి ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ ఇలాంటి సేవా దృక్పథం చేయడం మా కర్తవ్యం అని బడుగు బలహీన వర్గాలైన పేదవాళ్లకు మేము సాయం చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా గొల్ల కురమ యాదవ సంఘం మండల అధ్యక్షులు గజ్జి మల్లేశం వారి సంఘం తరపున ఆర్థిక సాయం చేయడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో యువత, గొల్ల కుర్మ సంఘ సభ్యులు పాల్గొనడం జరిగింది.

ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి: ప్రేమ్

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27(పిసిడబ్ల్యు న్యూస్): ప్రస్తుత బిజీ షెడ్యూల్ లైఫ్ లో ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల తప్పనిసరిగా శ్రద్ధ వహించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (NHRC) కరీంనగర్ టౌన్ ఛైర్మన్ ప్రేమ్ తెలిపారు. ఆదివారం నగరంలోని విద్యానగర్‌లో NHRC ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా ఈసీజీ, 2D ఈకో, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారంతో పాటు వ్యాయామం, సరైన నిద్రతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి తోడ్పడిన ప్రతిఒక్కరికీ ధన్యవాదములు అని చెప్పారు.

రేపు క్యాంపు కార్యాలయంలో పొంగులేటి శీనన్న జన్మదిన వేడుకలు

- వివరాలు వెల్లడించిన క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి

ఖమ్మం , అక్టోబర్ 27 (పిసిడబ్ల్యు న్యూస్ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ముద్దు బిడ్డ, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలను ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన సోమవారం (రేపు) నిర్వహించనున్నారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కేక్ కటింగ్ అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. అనంతరం క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు పీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. కావున ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పొంగులేటి శీనన్న అభిమానులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై పుట్టిన రోజు వేడుకలతో పాటు రక్తదాన శిబిరం, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

టిఎడియు రాష్ట్ర అధ్యక్షుడి గృహ ప్రవేశంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లులు

హసన్‌పర్తి : అక్టోబర్ 27, (పిసిడబ్ల్యు న్యూస్): తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది గుడిమళ్ళ రవికుమార్ నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా టిఏడీయు ఆటో డ్రైవర్లు రవికుమార్ కి భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో జన్ను కిషన్, మేకల రవీందర్, ఇమ్మిడి శెట్టి రాజు, గౌని రాజు, నవీన్, వీరాస్వామి, అంజయ్య, సదానందం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అద్వైత్ భార్గవ్ పుట్టినరోజు సందర్భంగా బదిరుల పాఠశాల విద్యార్థులకు పండ్ల పంపిణీ కార్యక్రమం...

కరీంనగర్, అక్టోబర్ 27 (పిసిడబ్ల్యు న్యూస్): లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో లయన్ మాచర్ల కిషోర్ గౌడ్ చైతన్య లతల యొక్క కుమారుడు అద్వైత్ భార్గవ్ ఐదవ పుట్టినరోజు సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ వద్ద గల బధిరుల (మూగ-చెవిటి) పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి (135) మంది విద్యార్థులకు పండ్లు, కేక్, బిస్కెట్స్, చాక్లెట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోల్డెన్ శాతవాహన అధ్యక్షులు లయన్ మానువాడ శంకర్, కార్యదర్శి లయన్ ననువాల గిరిధర్ రావు, కోశాధికారి లయన్ డా. కుంభోజు రమేష్, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ పాశం నర్సింహారెడ్డి, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ చిలుపూరి రాములు, లయన్ బిరుదుల ప్రవీణ్, లయన్ కుంభోజు సమత, తిరుపతి రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పి ఇ టి, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం బయ్యారం మండల కార్యదర్శిగా నంబూరి మధు ఏకగ్రీవం

బయ్యారం,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యు న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల, సిపిఎం పార్టీ 9వ మండల మహాసభలు మండల కేంద్రంలోని బొందలపాటి ప్రసాద్ రావు నగర్, వేజ్జెల్ల జిల్లా సైదులు రావు భవన్లో సీతారామ్ ఏచూరి ప్రాంగణంలో శనివారం జరిగాయి. ఈ మహాసభలలో నూతన మండల కమిటీ పదిమందితో ఆ పార్టీ ఎన్నుకోబడిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బయ్యారం మండల కార్యదర్శిగా నంబూరి మధు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల కార్యదర్శితో పాటు మండల కమిటీ సభ్యులుగా మక్కెన తిరుపతిరావు, ఆనందరావు, వల్లాల వెంకన్న,చంటి, అంగిరేకుల నాగేశ్వరావు, ఎస్కేయాకూబ్, కడారి విజయ, వి.మోహన్ , పురుషోత్తం లను మండల మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందనీ తెలిపారు. ఈ మహాసభల్లో పార్టీ గత కార్యక్రమాల ను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోవడం జరిగిందని తెలిపారు.రానున్న రోజుల్లో పార్టీ స్థానిక సమస్యలైన బయ్యారం పెద్ద చెరువు అభివృద్ధి, బి.ఎన్ గుప్తా ప్రాజెక్ట్ అభివృద్ధి, ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ఆందోళన నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం

• కరీంనగర్ జిల్లా ఉద్యమకారుల ఫోరం చైర్మన్ కనకం కుమారస్వామి మరియు కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ మోతే ఎల్లారెడ్డి

కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(పీసీడబ్ల్యు న్యూస్): ఈరోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవన్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగిందిఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి మరియు కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ మోతే ఎల్లారెడ్డి మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే విధంగా నాడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి నిజమైన తెలంగాణ ఉద్యమకారునికి 250 గజాల భూమి ఇస్తామని తమ మేనిఫెస్టోలో పెట్టుకోవడం జరిగింది అందుకు తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతున్నము మరియు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చినటువంటి హామీలు సంవత్సరం కావస్తున్న సందర్భంలో తెలంగాణ ఉద్యమకారులకు ఆత్మగౌరవం ప్రతిబింబించే విధంగా తెలంగాణ ఉద్యమకారులను గౌరవించాలని హామీ ఇచ్చినటువంటి 250 గజాల భూమి నెలకు 25 వేల పెన్షన్ మరియు ఉద్యమ కళాకారులకు పెన్షన్ మరియు తెలంగాణ ఉద్యమకారుల ఎంపికకు కమిటీ వేయాలని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రతి తెలంగాణ ఉద్యమకారులకు అండగా నిలవాలని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో 10 శాతం తగ్గకుండా సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారులకు హెల్త్ కార్డులు వంటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాంఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా విభాగం ఉత్తర తెలంగాణ కోఆర్డినేటర్ ఐల ప్రసన్న చొప్పరి సుధాకర్ కరీంనగర్ టౌన్ మహిళా అధ్యక్షురాలు కారుపాకలమున్న కరీంనగర్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు భార్గవి రాష్ట్ర నాయకులు మాధవి సాగర్ సుధాకర్ చిన్న సాయిలు లక్ష్మి గాలి రమేష్ కొయ్యడ పద్మ అంజలి కనక లక్ష్మి విలాకర్ సంతోష్ కుడితి శ్రీనివాస్ విజయ భాస్కర్ రెడ్డి గాలిపెల్లి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం - కరీంనగర్

బయ్యారంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర,జిల్లా కార్యవర్గ సామూహిక సమావేశం

బయ్యారం,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యు న్యూస్): మహబూబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామచంద్రస్వామి ఫంక్షన్ హాల్ అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర,జిల్లా కార్యవర్గ సామూహిక సమావేశం రాష్ట్ర అధ్యక్షులు టి.వి పుల్లం రాజు నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పుల్లం రాజు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మాల ధరించి 41 రోజులు నియమ నిష్ఠలతో పూజలు చేసి శబరిమల యాత్రకు బయలు దేరిన స్వాములు,భక్తులకు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఎరిమేల నుండి పంబ వెళ్లే మార్గ మధ్యంలో శివంకు దగ్గరలో నారాయణ తోడు ప్రాంతంలో సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన మందిరం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ అన్నదాన మండపం వద్ద 18 అడుగుల ఎత్తు గల అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. ఈ అన్నదాన మండపం వద్ద శబరిమలలో దేవాలయం తెరిచి ఉన్న సమయంలో ప్రతిరోజు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రతిష్టించిన అయ్యప్ప స్వామి విగ్రహానికి శబరిమలలో సేవలు అందించిన మాజీ మెయిల్ శాంతులు,పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.రాష్ట్ర కార్యదర్శి కర్నా.సిద్దు మాట్లాడుతూ నారాయణ తోడు సంఘటన ప్రాంతాలలో సంస్థ నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లో సేవ చేయుటకు అన్ని జిల్లాల వాలంటరీ కమాండెంట్స్ సభ్యులను ప్రోత్సహించి వాలంటరీ సర్వీస్ చేయుటకు పంపించాల్సిందిగా కోరారు. మూడ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ సంస్థ నిర్వహించే అన్నదాన కార్యక్రమాలకు సభ్యులు చేయూతనిచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కేంద్రానికి చెందిన పెద్దినేని వెంకటేశ్వరరావు ను మహబూబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నియమించారు.ఈ సమావేశానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి దుశెట్టి భాస్కర్, ఉపాధ్యక్షులు ఢిల్లీ ఏడుకొండలు, నల్ల గురవయ్య రాష్ట్ర పి ఆర్ ఓ సాగర్ గౌడ్, వాలంటరీ కమాండెంట్ తల్లాకుల కృష్ణ కార్యవర్గ సభ్యులు బలుసు రాము చౌదరి,సోమా పురుషోత్తం, బెతోజు భాస్కరాచారి, మహబూబాద్ జిల్లా అధ్యక్షులు గుండగాని ఉప్పలయ్య, కార్యదర్శి బండికట్ల శ్రీనివాసచారి, కోశాధికారి బెల్లంకొండ శ్రీనివాస్ వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే....

• మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు......

జమ్మికుంట, అక్టోబర్ 27 (పిసిడబ్ల్యు న్యూస్): రానున్న రోజుల్లో తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని మాజీ మంత్రి, బిజెపి రాష్ట్ర నాయకులు నేరెళ్ల ఆంజనేయులు అన్నారు. ఈరోజు జమ్మికుంట పట్టణంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ అనేక రకాల హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆంజనేయులు మండిపడ్డారు. అనతికాలంలోనే ప్రజల చేత చీత్కరించుకున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని మాజీ మంత్రి ఆంజనేయులు చురకంటించారు. గతంలో పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, అదోగతి పాలు చేసిందని, మాజీ మంత్రి దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ లేదని జోస్యం చెప్పారు. తెలంగాణలో బిజెపికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని దానికి అనుగుణంగా బిజెపి కార్యకర్తలు పనిచేసి పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేపించాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు. జమ్మికుంట పట్టణంలో పెద్ద ఎత్తున బీజేపీ సభ్యత్వం చేపించిన పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్,మరియు పట్టణ కమిటీని ఆంజనేయులు అభినందించారు. మాజీ మంత్రి వెంట, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, జిల్లా కార్యదర్శి చెన్నమాధవుని నరసింహ రాజు,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు,పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, పల్లపు రవి ఠాగూర్ రాజేష్ అప్పం మధు యాదవ్ మోడం రాజు బూరుగుపల్లి రామ్ అప్పల రవీందర్ కొండపర్తి ప్రవీణ్ తదితరు పాల్గొన్నారు.

అదృష్టంతో ఉద్యోగం రాదు కష్టపడితేనే ఉద్యోగం వస్తుంది

• సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్

కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(పీసీడబ్ల్యు న్యూస్): కరీంనగర్ జిల్లా: అదృష్టం తో ఉద్యోగం రాదని రాత్రింబవళ్లు కష్టపడి సంబంధిత సబ్జెక్టులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉంటేనే ఉద్యోగం వస్తుందని సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. గన్నేరువరం మండలంలోని చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన రామిడి సాగర్ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా నియామకం కాగా ఆదివారం రామిడి సాగర్ ను సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హన్మండ్ల భాస్కర్ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని మన ఆర్థిక స్థితిగతులను మార్చేస్తుందని అన్నారు. నేటి యువత వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యసాధన కోసం పాటుపడి తగిన కృషితో లక్ష్యాన్ని సాధించ వచ్చునని అన్నారు. చదువు క్రమశిక్షణను అలవరస్తుందని చదువులో ఆనందం పొందితే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటామని అన్నారు. నేటి యువత తమ శక్తిని వృధా చేస్తున్నారని చదువు జీవితాన్ని మార్చేస్తుందని అన్నారు. రామిడి సాగర్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఉపాధ్యాయునిగా నియామకమైన సాగర్ జన్మనిచ్చిన తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు జన్మనిచ్చిన చీమలకుంటపల్లి గ్రామానికి పేరు తీసుకువచ్చారని అన్నారు. సాగర్ తో పాటు తన భార్య నవ్య కు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, శాంత కుమార్ సింగ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

మోషన్ టాలెంట్ ఎగ్జామ్స్‌కు విశేష స్పందన

• 800 మంది విద్యార్థులు టాలెంట్ ఎగ్జామ్ వ్రాశారు • మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్

హనుమకొండ ప్రతినిధి: అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): ఐఐటీ మెడికల్ కోచింగ్ కు దేశంలోని అగ్రగామి విద్యాసంస్థ ఐన మోషన్ ఐఐటీ నీట్ ఇన్స్టిట్యూట్ ఆదివారం దేశవ్యాప్తంగా మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహించడం జరిగింది. మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్ట్యూట్ హన్మకొండ బ్రాంచ్ లో నిర్వహించిన మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ కు విశేష స్పందన లభించిందని, దాదాపు 800 మంది విద్యార్థులు ఈ పరీక్ష వ్రాసినట్లు మోషన్ ఐఐటి, నీట్ ఇన్స్టిట్యూట్ హన్మకొండ బ్రాంచ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఐఐటీ, మెడికల్ విద్య కోసం సుదుర ప్రాంతాలకు వెళ్లకుండా, హన్మకొండలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో ఐఐటి మెడికల్ కోచింగ్ లో నిష్ణాతులైన అధ్యాపకులతో దేశంలోనే అగ్రగామి విద్యా సంస్థ అయినా రాజస్థాన్ కోటా బ్రాంచ్ మోషన్ ఐఐటి నీట్ ఇన్స్టిట్యూట్ ఇక్కడి విద్యార్థుల కోసం హన్మకొండ లో స్థాపించడం జరిగిందని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. ఈ రోజు వ్రాసిన పరీక్ష లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కోటా హెడ్ సెంటర్, హన్మకొండ బ్రాంచ్ నుండి ఫీజు లో అనేక రకాల రాయితీలు ప్రకటించడం జరిగిందని అన్నారు. ఈ పరీక్ష ఫలితాలు 15 రోజుల్లో విడుదల చేయనున్నట్లు వడ్లకొండ వేణుగోపాల్ గారు తెలిపారు. ఈ రోజు మోషన్ టాలెంట్ సెర్చ్ పరీక్ష రాసిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఈ పరీక్ష కోసం ప్రోత్సహించిన అధ్యాపకులకు పాఠశాల యజమానుల అందరికి ఈ మోషన్ బ్రాంచ్ నుండి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్స్ చిర గణేష్ గౌడ్, పెరమండ్ల అనిల్ గౌడ్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మురళి మార్కెటింగ్ మేనేజర్ శనగరపు సుమన్, మార్కెటింగ్ టీం సభ్యులు తాల్లపెల్లి రమేష్, రచ్చ కుమార్, పాక నాగరాజు, రవీందర్ రావు, శశిధర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసుల హననాన్ని ఆపి ఉపా చట్టాన్ని రద్దు చేయాలి

• వక్తలు మంజీరా ప్రొఫెసర్ సాయి బాబా కూతురు మరియు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి పిలుపు

కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(పీసీడబ్ల్యూ న్యూస్): ప్రొఫెసర్ జీఎన్. సాయి బాబా సంస్మరణ సభ కరీంనగర్ జిల్లా కేంద్రం లోని ప్రెస్ భవన్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.మూడు సెషన్ లుగా జరిగిన ఈ కార్యక్రమానికి బాలసాని రాజయ్య విరసం, శ్రీపతి రాజగోపాల్ పౌర హక్కుల సంఘం, నారా వినోద్ లు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మంజీరా,ప్రొఫెసర్ సాయి బాబా కూతురు మాట్లాడుతూ సాయి బాబాను ప్రభుత్వమే హత్య చేసిందని, 90% అంగ వైకల్యం, పోలియో ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న మందులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. అరెస్ట్ చేసిన సందర్భంలో సాయి బాబా వినియోగించే వీల్ చైర్ ను కావాలని ధ్వంసం చేశారని అంబులెన్సు లో హాస్పిటల్ కు తీసుకెళ్లి సందర్భంలో తన కుడి చెయ్యి ని బలవంతంగా లాగడం వల్ల చెయ్యి చాలా నొప్పి లేసిందిని మంజీరా చెప్పారు. జైలు నిబంధనల ప్రకారం సమయానికి ఎమర్జెన్సీ మందులు, పుస్తకాలు, ఇతర సామాగ్రిని కూడా ఇవ్వకుండా రాజ్యం ఇబ్బందులకు గురిచేసిందని ఆమె పేర్కొన్నారు.దళితుల పక్షాన,పీడిత ప్రజల పక్షాన,ఆదివాసీలపై ప్రభుత్వాల దమనకాండకు, వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రభుత్వం కక్ష కట్టిందని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ గ్రీన్ హంట్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్నో సభలు, సమావేశాలు నిర్వహించడం మూలంగానే సహించలేని ప్రభుత్వం అక్రమ ఉపా (యుఏపీఏ)కేసు మోపి జైల్లో నిర్బందించిదని ఆమె అన్నారు. జైలల్లో ఎందరో ఆదివాసీ యువకులు చేయని నేరానికి అక్రమంగా నిర్బందించిందని వారికోసం ఏదైనా చేయాలనీ నాతో చెప్పారని, వారికోసం ఒక విద్యా సంస్థ ను నెలకొల్పే ఆలోచన సాయి బాబా కు ఉండేదని ఆమె పేర్కొన్నారు.సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి మాట్లాడు ఐక్య ఉద్యమాల ద్వారా ఉపా చట్టం రద్దు కోసం పోరాడుదామని తెలిపారు. అన్నీ వర్గాల ప్రజలను కలుపుకొని బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడడానికి ఒక వేదికను ఏర్పాటు చేయడానికి సిపిఐ పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో మాధన కుమారస్వామి పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. విశ్వనాథ్ ఐఎఫ్టీయు రాష్ట్ర అధ్యక్షులు, వీరగోని పెంటయ్య, రిటైర్డ్ ఎంఈఓ, శ్రీపతి రాజగోపాల్ పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షు లు,మార్వాడి సుదర్శన్, డిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ముద మాడుగుల మల్లన్న రైతు సంఘం, సిపిఎం కరీంనగర్ జిల్లా కార్య దర్శి వాసుదేవ రెడ్డి, కె. అజయ్ మానవ హక్కుల వేదిక అవునూరి సమ్మన్న, రచయిత, జర్నలిస్ట్ అన్నం దేవేందర్ ప్రముఖ రచయిత, చుక్క గంగా రెడ్డి, దొగ్గల రాజు, విద్యార్థి నాయకులు కందుకూరి అంజయ్య, రచయిత తాళ్లపల్లి లక్ష్మణ్ దళిత హక్కుల పోరాట సమితి, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఎంసీపిఐ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లగౌడ్ తదితరులు సాయి బాబు ను ఉద్దేశించి మాట్లాడారు. సిపిఐ, సిపిఎం, , డీటీఎఫ్ మానవ హక్కుల వేదిక, డిహెచ్ పీఎస్,ఎం సీ పి ఐ ఇతర ప్రజా సంఘాల నాయకులు, కవులు, రచయితలు, మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కిట్స్ వరంగల్ సాక్ -హ్యుమానిటీ క్లబ్ విద్యార్థులు ఫీడ్ ది నీడ్ అనే పేరుతో ప్రభావవంతమైన కార్యక్రమం నిర్వహణ

HUMANITY CLUB
FEED THE NEED

హసన్‌పర్తి, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): హ్యుమానిటీ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ వరంగల్ (కిట్స్‌డబ్ల్యు) విద్యార్థుల ఆధ్వర్యంలో కరుణ మరియు సామాజిక బాధ్యత యొక్క విశేషమైన సంజ్ఞలో "ఫీడ్ ది నీడ్" అనే పేరుతో ప్రభావ వంతమైన కార్యక్రమాన్ని నిర్వహించారనీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ ఫీడ్ ద నీడ్ సామాజిక కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం ఎంత ముఖ్యమో, సామాజిక స్పృహ, దయగల వ్యక్తులను అభివృద్ధి చేయడంలో విద్యా సంస్థల పాత్రను పటిష్టం చేసిందన్నారు. ఈ చౌరవ అవసరమైన కుటుంబాలకు భోజనం మరియు ఆహార సామాగ్రిని అందించడమే కాకుండా ఆహార అభద్రత మరియు సామాజిక సవాళ్లను ఎదుర్కోవడంలో సమాజ ప్రమేయం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచింది. ఆహారం పంపిణీ చేయడం మరియు విరాళాలు సేకరించడం నుండి యువత నేతృత్వంలోని సామాజిక బాధ్యత యొక్క ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం వరకు వివిధ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారు.ఈ సందర్భంగా రాజ్యసభ ఫార్మర్ ఎంపీ, కిట్స్‌డబ్ల్యు చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కిట్స్ వరంగల్ యాజమాన్య సభ్యులు, కోశాధికారి శ్రీ. పి.నారాయణరెడ్డి , హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే, కిట్స్‌డబ్ల్యు అదనపు కార్యదర్శి వొడితల సతీష్ కుమార్ హ్యుమానిటీ క్లబ్ కార్య నిర్వాహక విద్యార్థి బృందాన్ని ఇట్టి ఫీడ్ ద నీడ్ సామాజిక కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం బాధ్యత ను ప్రయోగాత్మకంగా నిర్వహించినందుకు శుభాకాక్షలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ ఎఫైర్స్, ప్రొఫెసర్ ప్రొఫెసర్. యం. శ్రీలత, అసోసియేట్ డీన్ , అసోసియేట్ ప్రొఫెసర్, ఎం. నర్సింహారావు, అసోసియేట్ ప్రొఫెసర్ , పి ఆర్ ఓ డాక్టర్ డి ప్రభాకరాచారి, హ్యుమానిటీ క్లబ్‌సి ఫ్యాకల్టీ ఇంచార్జి డాక్టర్ జి. శ్రీనివాసరావు, హ్యుమానిటీ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆసిఫ్ అబూబకర్, సంయుక్త కార్యదర్శులు బి. ఈశ్వర్ దత్తు, టి. సంజన, వి. హృషిత, ఎ. అభిచరణ్ అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ సాధనలో ఉద్యమకారులే పునాది రాళ్ళు

హసన్ పర్తి, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రం సాధించిన తరువాత రెండు సార్లు రాష్ట్రాన్ని పాలించిన పాలకులు ఉద్యమకారుల పేరెత్తకుండా. పాలించి ఇప్పుడు ఫాంహౌస్కి పరిమితమయ్యారు. ఉద్యమమే ఊపిరిగా ఫోరం ఏర్పాటు చేసిన ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ 33 జిల్లాలు మొత్తం తిరిగి ఉద్యమకారుల హక్కుల కోసం ఆనాటి మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి కి వినతి పత్రం ఇచ్చినా మరుక్షణమే కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి తుక్కుగూడ బహిరంగ సభలో తెలంగాణ ఇచ్చినా తల్లి సోనియమ్మ తో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని మాట ఇచ్చారు అట్టి మాటకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీ గెలుపులో ముందు వరుసలో ఉన్నది ఉద్యమ కారులే కాబట్టి ఇచ్చినా మాట ప్రకారం 250 గజాల ఇంటి స్థలం తో పాటు నిర్మాణానికి 5 లక్షలు ప్రతి నెల 25 వేల ఫించన్ బస్ రైల్వే పాస్ హెల్త్ కార్డు గుర్తింపు కార్డు మరియు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయ్యాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనిఫెస్టో కమిటీతో చర్చించి సత్వరమే న్యాయం చెయ్యాలి లేని పక్షంలో మరో పోరాటానికి సిద్ధంగా ఉండి రాష్ట్ర సాధనలో ఎలా ఉద్యమాలు చేసామో ఇప్పుడు మా హక్కుల కోసం మరో పోరాటానికి సైనికుల్లా ముందుంటామని వర్ధన్నపేట నియోజకర్గ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు చిలువేరు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా అధ్యక్షులు బాష బోయిన రవీందర్ యాదవ్ మండల అధ్యక్షులు బుర్ర రవీందర్ గౌడ్ జిల్లా మీడియా అధికార ప్రతినిధి రామంచ మధుకర్ మాజీ కో ఆప్షన్ అక్బర్ ఉద్యమకారులు భిక్షపతి, సంతోష్, రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

దశదిన కర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్

రామడుగు,అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగు మండలం గోపాలరావు పేట గ్రామంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత అలవాల విష్ణు భార్య రమ్యకృష్ణ దశ దినకర్మలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పాల్గొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి అనంతరం రమ్యకృష్ణ చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించిన చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గుడుంబా అక్రమంగా రవాణా చేస్తున్న బైకర్ అరెస్ట్

పరకాల,అక్టోబర్ 27(పీసీడబ్ల్యూ న్యూస్):శాయంపేట మండలం కొప్పుల గ్రామ శివారులో అక్రమంగా గుడుంబా రవాణా చేసున్న తండాకు చెందిన సూర్య నాయక్ తండ్రి బెంగ్యా, అనే వ్యక్తిని అరెస్టు చేసి 20 లీటర్ల గుడుంబా తో పాటు బైకు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ జ్యోతి తెలిపారు. ఈ రూట్ వాచ్‌లో కానిస్టేబుల్స్ విజయ్‌కుమార్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

రామడుగు, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగులోని నర్సింగారావు చెరువు దగ్గరికి వెళ్లేసరికి అక్కడ ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7,070/- రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి ఎస్సై విశేఖర్ వివరించారు.

సైకాలజిస్టుల కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి

రామడుగు, అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): సైకాలజిస్ట సంక్షేమం కోసం ప్రభుత్వ వెంటనే కౌన్సిల్ను ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకోలోజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మోతుకూరి రామచందర్ అన్నారు..ఆదివారం కరీం నగర్ లోని ఆల్ఫోర్స్ జూనియర్ కాలేజ్ మెయిన్ క్యాంపస్ లో ఉమ్మడి జిల్లా సైకాలజిస్ట సమావేశం నిర్వహించారు ..ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సైకాలజిస్ట్ అవసరం ప్రతి వ్యక్తికి ఉందని, పాఠశాలాల పాటు అన్ని కళాశాలలో సైకాలజిస్ట ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.. మానసిక వైకల్యం లేదా మానసిక ఆలోచన వైకల్యం కలవారిని బావిపౌరుత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురు తర బాధ్యత సైకాలజిస్ట్ లపై ఉందని అన్నారు.. ప్రతి సైకాలజిస్ట మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని పిలుపునిచ్చారు.. సైకాలజిస్ట్ సమర్ధవంతంగా తన బాధ్యత నిర్వహిస్తే సమాజం సుభిక్షితంగా ఉంటుందని అన్నారు.. మానసిక రోగులు లేని సమాజం కోసం పాటుపడాలని కోరారు.. లీడర్ షిప్ లక్షణాలు లక్షణాలను సమాజంలో అనేకమందిని లీడర్ను తయారు చేయాలని పిలుపునిచ్చారు.. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నం చందర్ జిల్లా అధ్యక్షులు ఎగ్రా మల్లేశంఈశ్వర్,సతీష్,అనురాధ , భూమేష్,శ్రీనివాస్ ,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ది ముస్లిం ఎడ్యుకేషనల్ సొసైటీ కరీంనగర్ నుండి కోచింగ్ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి ఘనంగా ఫెలిసిటేషన్ వేడుక కార్యక్రమం

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): నగరంలోని ముకరంపురలో గల కరీంనగర్ ఫంక్షన్ ప్యాలెస్ లో ది ముస్లిం ఎడ్యుకేషనల్ సొసైటీ కరీంనగర్ నుండి కోచింగ్ పొందడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు 4-DSC-2024 అత్యుత్తమ విజయాలు సాధించి, గురుకుల , గ్రూప్-4లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన విద్యార్థులు ప్రశంసలు పొందారు, వారికి ఫెలిసిటేషన్ వేడుక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో రిటైర్డ్. DEO అబ్దుర్ రషీద్, ఎంఎ జూనియర్ లెక్చరర్ కెఎస్ జమీల్, రిటైర్డ్. టీచర్ మొక్తదిర్, ఎస్ఎ బయో సయ్యద్ జుబేర్ అహ్మద్, ఎస్ఎ గణితం ఫహద్ బిన్ అలీ, ఎస్ఎ ఇంగ్లీష్ సలేహాసిద్దిఖా,ఈస్ఎ ఫిజిక్స్ పిజిటీ మ్యాథ్స్. మొహమ్మద్ సదత్ అలీ,హసన్ బిన్ అలీక్వాజీ, ఎండి షాజియుద్దీన్ పిజిటీ ఉర్దూ, ఎండి షకీర్ అలీ పిజిటీ ఉర్దూ, ఆయేషా తలత్ ఐజాజ్ ఫాతిమా సార్జంట్, సయ్యద్ అన్వరుల్లా ప్రిన్సిపాల్, ఇజ్హర్ హుస్సేన్ జూనియర్ లెక్చరర్, ఎండి ఆసిఫ్ ఎం.కామ్,ఏంబిఎ, ఇష్రత్ ఫాతిమా ఆహారం, నాగశేఖర్ ఎం.ఎ. ఇంగ్లీష్, ఎండి.అబ్దుల్ హకీమ్ ఎల్స్ ఎం.ఈడి.లు అధ్యక్షత వహించారు, మరియు టీజి గురుకులలో ఎంపికైన అభ్యర్థులు ఆయేషా ఫాతిమా. డిఎల్ వృక్షశాస్త్రం, ఫైజా బ్యాటూల్ జ్ఎల్ ఎకనామిక్స్ ఆర్కే, హాజియా ఆఫ్రీన్ జెఎల్ ఉర్దూ, గౌసియా బేగం టీజిటీ సోషల్, రేష్మా కౌసర్ టీజిటీ ఉర్దూ, సబా ఇమ్రోజ్ పిజిటీ ఇంగ్లీష్, ఫైజా షీరిన్ టాస్కీన్ టీజిటీ ఉర్దూ ఆర్కే, డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులు షీరిన్ ఫర్హాత్, ఎండి. అష్రాఫ్ అహ్మద్, ఎస్ఎ జీవశాస్త్రం ఆర్కే, హుమేరా బేగం ఎస్జిటీ, ఆర్ స్కోపేట్, ఎస్ఎ సామాజిక, ఫౌజియా కోసర్ సార్జంట్, సయ్యద్ ముతాహిరుద్దీన్ సార్జంట్ ఆర్కే, యాస్మీన్ ఖాన్ సార్జంట్, ఫిరోజ్ ఖాన్ ఎస్జిటీ ఆర్ఐఎస్ కర్మర్, పర్వీన్ అహ్మదీ 5జిటీ ఈఆర్. రెండింటిలోనూ ఎంపికైన అభ్యర్థులు, గురుకుల, డీఎస్సీ, మహ్మద్ ముజఫరుద్దీన్ అహ్మద్ కరీంనగర్ ఫంక్షన్ ప్యాలెస్ అధ్యక్షుడు మేస్క్ డా. మొహమ్మద్ సలీముద్దీన్, జనాబ్ మీర్జా అహ్మద్ బైగ్, జనాబ్ షేక్ అబూ బకర్ ఖలీద్, జనాబ్ సయ్యద్, ముజఫరుద్దీన్ అహ్మద్, జనరల్ సెక్రటరీ మెస్క్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మేస్క్, ఆర్గనైజ్డ్: ది ముస్లిం ఎడ్యుకేషనల్ సొసైటీ కరీంనగర్, తదితరులు పాల్గొన్నారు.

జన్వాడ ఫామ్‌హౌస్‌లో ఏం జరిగిందో ప్రజలకు తెలియాలి: రఘునందన్ రావు

హైదరాబాద్:అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):హైదరాబాద్‌లో విచ్చలవిడిగా డ్రగ్స్ దందా జరుగుతోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. వీకెండ్ వచ్చిందంటే హైదరాబాద్ నగరంలో రేవ్ పార్టీలతో రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. జన్వాడ ఫామ్‌హౌస్‌లో ఏం జరిగిందో ప్రజలకు ప్రభుత్వం తెలియజేయాలని డిమాండ్ చేశారు.పోలీసులే కొంతమంది పెద్దలను పంపినట్లు తెలుస్తుందని చెప్పారు. రేవ్‌పార్టీలో వీఐపీల పిల్లలున్నారని వార్తలొచ్చాయని, ఫామ్ హౌజ్ లో సీసీటీవీతోపాటు చుట్టూ ఉన్న సీసీ ఫుటేజ్ విడుదల చేయాలన్నారు. సీఎం రేవంత్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని అనుమానం ఉందని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు.కాగా, జన్వాడ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడులు చేసి 42 మందిని అదుపులోకి తీసుకున్నారు. అనధికారికంగా విదేశీ మద్యం, అనుమతి లేకుండా రేవ్ పార్టీ నిర్వహించినందుకు కెటిఆర్ బావమరిది రాజ్ పాకాలపై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు.

ఉపాధ్యాయుల ఆశలు వమ్ము చేసిన ప్రభుత్వం

- తక్షణం రెండు డిఏలు ప్రకటించాలి
- ఎస్టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత రెడ్డి

రామడుగు,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేరుస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారి ఆశలను వమ్ము చేసిందని ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత రెడ్డి పేర్కొన్నారు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్టియు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించాలని వెంటనే మరో డిఎ ను కూడా తక్షణం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మెరుగైన పిఆర్సి ని ప్రకటించాలని 317 బాధితులకు సంబంధించి పూర్తి న్యాయం జరిగేలా స్థానికత అంశాన్ని పరిశీలించి అనుకూల నిర్ణయం వెలువరించాలని అన్నారు వెంటనే ఈ కుబేర్ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల పెండింగ్ బిల్లులు తక్షణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఉపాధ్యాయుల ఆత్మాభిమానం దెబ్బతిన్నప్పుడు ఉద్యమ కార్యాచరణకు ఎస్టియు వెనకాడన్నారు ఈ సమావేశంలో నాలుగు జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి ఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి , బైరం హరికిరణ్, మెరుగు సతీష్,, రేవోజు సదానందం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, ఎన్ సంతోష్ ,శనిగరపు రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి సీర్నంచ రవిందర్, రాష్ట్ర బాధ్యులు కందుకూరి దయానంద్, వెంకట స్వామి, లక్ష్మణ్ రావు, తోట రాజు,, గుండా శ్రీనివాస్, కోట శ్యాం కుమార్ నాగభూషణం శ్రవణ రాజేందర్రెడ్డి ఖలీల్ కందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డ్స్ వాచ్మెన్ స్వీపర్స్ హౌస్ కీపింగ్ వార్డు బాయ్ కార్మికుల జిల్లా సదస్సు విజయవంతం

- ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యూనియన్ గౌరవ అధ్యక్షులు పున్నం రవి కార్మికులకు పిలుపు
- తాత్కాలిక సెక్యూరిటీ గార్డ్స్‌కి 800 వందల రూపాయలు రోజుకి ఇవ్వాలి
- ఒక్క సెక్యూరిటీ గార్డ్‌పై 6000 ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు యజమానుల శ్రమ దోపిడి

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): నగరంలోని కోతిరాంపూర్ ముకుంద లాల్ మిశ్రా భవన్ సిఐటియు జిల్లా కార్యాలయంలో కరీంనగర్ జిల్లా ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ అలైడ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా సదస్సు అధ్యక్షులు కామాద్రి ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది, దీనికి ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యూనియన్ అధ్యక్షులు పున్నం రవి హాజరై మాట్లాడుతూ.... సెక్యూరిటీ గార్డ్స్ ,వాచ్మెన్ ,స్వీపర్స్ ,హౌస్ కీపింగ్ ,వార్డు బాయ్, కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని పనిగంటలు 12 గంటలు పనిచేయించుకుంటూ తక్కువ వేతనాలు 7000ల నుండి 10000 వరకు మాత్రమే చెల్లిస్తూ శ్రమను దోచుకుంటున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు, ప్రైవేటు యజమానులు సెక్యూరిటీ ఏజెన్సీలు ఒక్క సెక్యూరిటీ గార్డ్ పై 6000 రూపాయలు శ్రమను దోచుకుంటూ ఏజెన్సీలు లాభాలు పడుతున్నాయి, జీతాలు పెంచాలని కోరితే మీకు ఇష్టమైతే చేయండి లేదంటే వెళ్లిపోండి మీరు దిక్కున చోట చెప్పుకోండి అని బెదిరింపులకు పాల్పడుతున్నారు, అకారణంగా తొలగించిన స్థానంలో సెక్యూరిటీ, స్వీపర్, హౌస్ కీపింగ్, వార్డ్ బాయ్ ,వాచ్మెన్ ఇతర కార్మికులు పనిచేయవద్దని కోరారు, కార్మికులకు అందరికీ సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు, కనీస వేతనం 26,000 పిఎఫ్ ,ఈఎస్ఐ ,సౌకర్యాలు కల్పించాలని బోనస్ చట్టం ఉన్నప్పటికీ ఎక్కడ అమలు చేయడం లేదని విమర్శించారు, లోకల్ ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నారు, లేబర్ కమిషనర్ ఇట్టి ఏజెన్సీల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.పని ప్రదేశాలలో గంటల తరబడి నిల్చడం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వాలు మరియు కార్మిక శాఖ ఏజెన్సీల అక్రమాలను నియంత్రించడంలో విఫలమవుతున్నాయని, ఫలితంగా గార్డులు మరియు హౌస్ కీపింగ్ కార్మికులు జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయని, కాబట్టి పై సమస్యలపై కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు మరియు హౌస్ కీపింగ్ వార్డు బాయ్ అపార్ట్మెంట్లో పనిచేసే వాచ్మెన్ కార్మికుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు, లేదంటే లేబర్ ఆఫీస్ ముందు కలెక్టరేట్ ఎదుట ఏజెన్సీల ముందు నిరసనలు ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సహాయ కార్యదర్శి నోముల జగన్ ఉపాధ్యక్షులు గున్నాల మల్లేశం భాస్కర్, పరుశురాం ,సుంక కుమార్, చరణ్ ,నాంపెల్లి ,రొడ్డ వాసు దేవయ్య, గసికంటి నరసయ్య ,తమ్మడి నరేందర్, కాసు రాజ్ కుమార్, మల్లేశం ఓదెల రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత ఇంద్రసేనారెడ్డి కన్నుమూత

కాంగ్రెస్ సీనియర్ నేత
ఇంద్రసేనారెడ్డి
కన్నుమూత

హైదరాబాద్: అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనారెడ్డి కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగానూ ఇంద్రసేనారెడ్డి సేవలందించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఇంద్రసేనారెడ్డి మృతిపట్ల కాంగ్రెస్ నేతలు సంతాపం తెలిపారు.

జాతీయ యువజన అవార్డు గ్రహీత అల్వాల విష్ణు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు,అక్టోబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత అల్వాల విష్ణు సతీమణి రమ్యకృష్ణ దంపతులకు గత 20 రోజుల క్రితంరోడ్డుప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో విష్ణుకు కాళ్లు చేతులు విరుగగా రమ్యకృష్ణ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఐదు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందిఈ నెల 17న మృతి చెందింది.కాగా ఆదివారం రమ్యకృష్ణకు దశదినకర్మ కార్యక్రమాలను కుటుంబసభ్యులు నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విష్ణు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ఓదార్చారు. అనంతరం రమ్యకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులుపాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్ఫరమ్ భయాందోళనలో కాలనీ వాసులు



రామడుగు,అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగు మండల కేంద్రంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబెడ్కర్ కాలనీలో కొద్ది అడుగుల దూరం లో ఉన్న ట్రాన్ఫరం ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతుంది, కానీ దానికి సంబందించిన ప్రమాద హెచ్చరికలు కానీ. ఫెన్సింగ్ ప్రహరీ కానీ ఇంత వరకు అధికారులు వేయలేదు .. అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లి మొరపెట్టుకున్నా చలనం లేదు .స్వతంత్రం వచ్చి 78 సంవస్త్రాలకు పైగా అవుతున్నా దళిత కాలనీలు పట్ల అధికారుల నిర్లక్ష్యపు వైఖరి మాత్రము మారడము లేదు.అని రామడుగు గ్రామ అంబెడ్కర్ నగర్ కాలనీ వాసులు వారి గోడును వినిపిస్తున్నారు. దీనిపై వెంటనే గుండి సబ్ స్టేషన్ AE స్పందించాలి ప్రజలు కోరుతున్నారు.

బాడీ ఫ్రీజర్ దాతలని సన్మానించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు/గంగాధర,అక్టోబర్ 27(పిసిడబ్ల్యూన్యూస్): గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన చిప్ప కళావతి సత్యనారాయణ అక్క అయినా కీర్తిశేషులు చిప్ప భూదేవి జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్ను గ్రామపంచాయతీకి విరాళంగా ఇవ్వడం జరిగింది. బాడీ ఫ్రీజర్ ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యము దాతలను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్, ఫ్రాక్స్ చైర్మన్ మండల అధ్యక్షులు, మండల నాయకులుగ్రామానికి చెందిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గంగుల కమలాకర్ కుటుంబాన్ని పరామర్శించిన వినోద్ కుమార్-మాధవి దంపతులు

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీమంత్రి గంగుల కమలాకర్ కుటుంబాన్ని వారి నివాసంలో మాజీ ఎంపీ, మాజీ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ బోయిన్ పల్లి వినోద్ కుమార్-మాధవి దంపతులు కలుసుకొని పరామర్శించారు.. గంగుల మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులర్పించారు.